క్లుప్తంగా

అర్హులైన వారు దరఖాస్తు చేయండి

పెనమలూరు: ఏపీ సమగ్ర శిక్ష సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న కస్తూర్బా పాఠశాలలో పలు పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ జి. మహేశ్వరరావు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ ఎ.కొండూరు బాలికల పాఠశాలలో అసిస్టెంట్ కుక్, గంపలగూడెంలో డే వాచ్‌మెన్ పోస్టుకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేయాలని కోరారు. పై రెండు పోస్టులకు 7వ తరగతి పాస్ అయ్యి ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీన సాయంత్రం 5 గంటలకు దరఖాస్తు, మార్కుల జాబితా జత చేసి విజయవాడ ఎంకే బేగ్ హైస్కూల్, విజయవాడ సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నేటి నుంచి సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ క్యాంప్‌లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో ప్రజలకు ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్ సర్వీసును గ్రామ/వార్డ్ సచివాలయాల్లో ఈ నెల 24, 25 తేదీల్లో స్పెషల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. నగరంలోని 286 సచివాలయాల్లో ఈ క్యాంప్‌లను ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అదనపు కమిషనర్(జనరల్), యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ ఆధార్ అప్‌డేట్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలపాడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు నగరపాలకసంస్థ పాఠశాలలో బుధవారం హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షఫీవులా, మల్లికా మాట్లాడుతూ తమ వంతు బాధ్యతగా విద్యార్థులకు ట్రస్ట్ సభ్యుల సహకారంతో జామెంట్రీ బాక్సులు, నోటు పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. సుమారు 100 మంది విద్యార్థులకు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ట్రస్ట్ సభ్యులు అవినాష్, ఆదిత్య, మహేష్ పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే పరిశీలన



భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్ –2024 కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ నియోజకవర్గంలోని అజిత్‌సింగ్‌నగర్‌లో బుధవారం నిర్వహించిన డోర్ టు డోర్ సర్వే ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు వారి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు – చేర్పులు లేదా చనిపోయిన ఓటర్ల తొలగింపు వంటి వాటికి ఫారం –6, 6ఎ, 7, 8 ఫారంలను అందించి దరఖాస్తు చేయించారు. అనంతరం వాటిని మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ముఖ్యంగా ఒకే డోర్ నెంబర్‌లో ఎక్కువ ఓట్లు ఉంటే వాటిని, జీరో నెంబర్ ఉన్న వాటిని ప్రత్యేకంగా పరిశీలించారు. అలాగే 100 ఏళ్లపై బడిన ఓటర్ల వయసు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. కాగా సర్వే చేసిన అనంతరం సెంట్రల్ నియోజకవర్గం చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో సమీక్షించారు.

రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలోని గురుకుల సాంఘిక సంక్షేమ ప్రభుత్వ కళాశాలలో బుధవారం మహాభారత రచనకు ప్రేరకుడు, తెలుగు జాతికి ఆరాధ్యుడు రాజరాజ నరేంద్ర మహారాజు పట్టాభిషేక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వల్లూరు నీరజ అధ్యక్షతన అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. హైదరాబాద్ విశ్వవిద్యాలయ భాషాశాస్త్రశాఖ విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ జి. ఉమామహేశ్వరరావు, ఆంధ్ర లయోల కళాశాల చరిత్ర విభాగాధిపతి డాక్టర్ మొవ్వ శ్రీనివాసరెడ్డి ప్రసంగించారు. అనంతరం ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, కళాశాల సిబ్బంది అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.





ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా



పోలీస్ కంట్రోల్ రూం వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణుల బైక్ ర్యాలీ

ఎన్నిక ఏదైనా వైఎస్సార్ సీపీనే ఏలిక

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- వైనాట్ 175 నినాదంతో భారీ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ నాయకులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా అధికారంలోకి వచ్చేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయే అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్పష్టం చేశారు. 'బెజవాడ గడ్డ.. వైఎస్సార్‌సీపీ అడ్డా.. వైనాట్ 175' నినాదంతో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌తో పాటుగా వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, కార్పొరేషన్‌ల చైర్మన్లు, పార్టీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మూడు నియోజకవర్గాల నుంచి బయలుదేరిన బైక్ ర్యాలీలు చుట్టుగుంట సర్కిల్‌లో కలుసుకుని అక్కడ నుంచి ముందుకు సాగాయి. సెంట్రల్ నియోజకవర్గంలో ర్యాలీని సత్యనారాయణపురంలోని గాయత్రీ కన్వెన్షన్ సెంటర్ వద్ద ఎమ్మెల్యే విష్ణు ప్రారంభించారు. నగర వీధుల్లో జన సంద్రంగా సాగిన ర్యాలీ ఆసాంతం జై జగన్–జై జై జగన్ నినాదాలతో హోరెత్తింది. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని ఎప్పటికప్పుడు రెట్టింపు చేసుకుంటూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. అది చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాయని మండిపడ్డారు. మరీ ముఖ్యంగా నారా లోకేష్ కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. 11 అంశాలను ప్రస్తావిస్తే సమాధానం చెప్పకుండా మాట దాటవేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పైగా విజయవాడలో మాట్లాడే ధైర్యం లేక.. రెండు రోజుల తర్వాత గన్నవరంలో మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. చేసిన అభివృద్ధిపై చెప్పుకోవడానికి ఏమీలేక నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. నారా లోకేష్‌లా దిగజారి మాట్లాడటం తమకు చేతకాదన్నారు. తమ పథకాలను కాపీ కొడుతూ ప్రతిసవాళ్లు విసరడం సిగ్గుచేటన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధం..

తెలుగుదేశం పార్టీ ఒక అబద్ధాల ఫ్యాక్టరీ అని నారా లోకేష్ మాటలతో మరోసారి రుజువైందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ప్రభుత్వ భూములలో నివసిస్తున్న ప్రజలకు శాశ్వత భూహక్కు కల్పించామని లోకేష్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. దశాబ్దాలుగా నగర ప్రజలు ఎదుర్కొంటున్న ఇళ్ల రిజిస్ట్రేషన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ ఈ ప్రభుత్వంలో జీవోలు తీసుకురావడం జరిగిందన్నారు. దీనిపై ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధమని సవాలు విసిరారు. ఐదేళ్లు అమరావతి నామ జపం తప్ప నగర ప్రజలకు కావలసిన కనీస మౌలిక సదుపాయాలను కల్పించడంలో గత పాలకులు పూర్తిగా వైఫల్యం చెందారని ఆయన ఆరోపించారు. 2014–19, 2019–23 మధ్య కాలంలో జరిగిన అభివృద్ధిపై ఎప్పుడైనా, ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధమని స్పష్టం చేశారు.

విజయవాడకు తీరని ద్రోహం..

అమరావతిని నెత్తిన పెట్టుకుని ఉమ్మడి కృష్ణా జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన గత పాలకులకు ఈ ప్రాంతంలో పర్యటించే నైతిక హక్కు లేదని మల్లాది అన్నారు. మూడు రాజధానులలో అమరావతి కూడా ఉందనే విషయాన్ని మరిచిపోయి నారా లోకేష్ మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. మూడు ప్రాంతాల సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా ఈ ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు మల్లాది విష్ణు తెలిపారు. అమరావతి మోజులో పడి.. విజయవాడ నగరాన్ని స్మార్ట్ సిటీ కాకుండా తీవ్ర అన్యాయం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక నగరంలో పనులు శరవేగంగా జరుగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శైలజా రెడ్డి, కార్పొరేటర్లు శర్వాణి మూర్తి, బాలిగోవింద్, కొంగితల లక్ష్మీపతి, కొండాయిగుంట మల్లేశ్వరి, యరగొర్ల తిరుపతమ్మ పాల్గొన్నారు.

పాయకాపురంలో బైక్ ర్యాలీ..

పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ జరిగింది. డివిజన్లో మోహన్‌రావు కొట్టు వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలదండ వేసిన పిమ్మట పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్‌లపై ర్యాలీగా ప్రకాష్‌నగర్, ఫైర్‌స్టేషన్ మీదుగా గాయత్రి కన్వెన్షన్ హాలు వద్దకు వెళ్లారు. ర్యాలీలో డివిజన్ కోఆర్డినేటర్ వీరబాబు, నగర వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్, రామిరెడ్డి, మస్తాన్, వెంకట్,హైమావతి, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.



బైక్‌ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న కార్యకర్తలు



పాయకాపురంలో వైఎస్సార్ సీపీ బైక్ ర్యాలీ

10 టన్నుల కూరగాయల వితరణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తిరుమలలో జరిగే నిత్యాన్నదానానికి కూరగాయలను పంపించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని దాత మండవ నాగేశ్వరరావు చెప్పారు. తిరుమల పంపే కూరగాయల లారీకి పటమట ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వేత్త కంకణాల రమేష్, మండవ వెంకటరత్నంలు లారీకి జెండా ఊపి తిరుమలకు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2006వ సంవత్సరంలో విజయవాడ నుంచి తిరుమలకు కూరగాయలను పంపించడాన్ని సామాజికవేత్త మండవ కుటుంబరావు ప్రారంభించారన్నారు. ఈ ఏడాది మే 29న మండవ కుటుంబరావు ఆకస్మికంగా మరణించారని, ఆయన లేకపోయినా టీటీడీకి కూరగాయల పంపిణీ ఆగకూడదనే ఉద్దేశంతో ప్రతి నెలా కూరగాయల లారీని పంపుతున్నామని చెప్పారు. తిరుమల తిరుపతిలో జరిగే నిత్యాన్నదానానికి ప్రతి నెలా విజయవాడ నుంచే కూరగాయల లారీని దాతల సహకారంతో పంపుతామని చెప్పారు. మండవ కుటుంబరావు కుటుంబసభ్యులు సస్య, అరవపల్లి ఆదిత్య, కె.శ్రీహరిరావు, ధనేకుల వెంకట సత్యనారాయణ, శ్రీనివాస్, బీఏ నాగు పాల్గొన్నారు.



జెండా ఊపి లారీని ప్రారంభిస్తున్న దాతలు

శంకరమఠంలో ప్రత్యేక హోమం



విజయవాడ కల్చరల్: భారతదేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటి చెప్పిన చంద్రయాన్–3 యాత్ర విజయవంతం కావాలని కాంక్షిస్తూ బుధవారం నగరంలోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్‌పేటలోని శంకరమఠంలో రుత్విక్కులు నవగ్రహ శాంతిహోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శంకర మఠం ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ టీవీఎస్ మూర్తి, బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామ కృష్ణ మూర్తి, ఆధ్యాత్మిక వేత్త యాబలూరి లోకనాథశర్మ పాల్గొన్నారు.

భారత్ చంద్రహాసం



ముత్యాలంపాడులో విక్రమ్ ల్యాండింగ్ దృశ్యాలను తిలకిస్తున్న విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చంద్రయాన్–3 విజయంతం కావటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. చంద్రుని దక్షిణ ధృవంపై తొలిసారిగా విక్రమ్ సేఫ్ ల్యాండింగ్ అవ్వటంతో ముత్యాలంపాడు, మధురానగర్‌లో ఆక్స్‌ఫర్డ్, అజయ్ హైస్కూల్ విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని నినాదాలు చేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ముత్యాలంపాడు ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో చంద్రయాన్–3 ల్యాండింగ్ ప్రక్రియను డిజిటల్ క్లాసు ద్వారా విద్యార్థులకు వివరించారు. భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి చంద్రయాన్–3ను కక్ష్యలో పెట్టే విధానాన్ని తిలకించారు. ఇస్రో, సైంటిస్టులు, చంద్రయాన్ వేషధారణలతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల రీజనల్ ఇన్‌చార్జి ఉమారాణి, ప్రిన్సిపాల్ పి అశోక్ కుమార్, డైరెక్టర్ ఏపుగంటి సాయికృష్ణ పాల్గొన్నారు.

విజయ కాంక్షతో..

పాయకాపురం(విజయవాడరూరల్): చంద్రయాన్–3 విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం ఉదయం పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు జయహో ఇస్రో అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి. మోహన్, స్కైవాచ్ ఉమారాధా తదితరులు పాల్గొన్నారు.



పాయకాపురంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



ముత్యాలంపాడులో విద్యార్థుల ర్యాలీ



సింగ్‌నగర్‌లో విద్యార్థుల ర్యాలీ

చంద్రయాన్–3 విజయోత్సవ ర్యాలీ..

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ సెంట్రల్): చంద్రయాన్–3 విజయవంతమైన సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలకు జనంలో మనం స్వచ్ఛంద సేవ సంస్థ చైర్మన్ పొదిగింటి నాగరాజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ చంద్రయాన్ –3 విజయోత్సవం సందర్భంగా వాంబే కాలనీ, జంధ్యాల దక్షిణామూర్తి హైస్కూల్ విద్యార్థులతో కలిసి స్కూల్ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించామన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే ధ్యేయం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే ధ్యేయంగా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్ పారదర్శక పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 32వ డివిజన్ 230వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కోఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి, నగరపాలకసంస్థ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి అయోధ్యనగర్‌లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ విధంగా లబ్ధి చేకూర్చింది? ఎంత లబ్ధి చేకూర్చింది? ప్రజలకు వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకొని సంబంధిత అధికారితో సమన్వయం చేసుకొని పరిష్కారం మార్గాన్ని చూపుతూ ముందుకు సాగారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కార్యక్రమంలో సీడీఓ జగదీశ్వరి, డివిజన్ ఇన్‌చార్జి గుండె సుందర్ పాల్, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, ఎంఎస్ఆర్, ఒగ్గు గవాస్కర్, శ్యామ్ బాబు, జగన్‌మోహన్‌రెడ్డి, రంగబాబు, ఆదిరెడ్డి, పుష్పలత, లత, కుమారి తదితరులు పాల్గొన్నారు.



32వ డివిజన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

కొండ ప్రాంతాల్లో ఇళ్ల క్రమబద్ధీకరణ

పటమట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొండ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తోందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఆమె 46వ డివిజన్‌లోని కొండ ప్రాంతాల్లో పర్యటించారు. చిట్టినగర్ పరిధిలోని సయ్యద్ అప్పలస్వామి కళాశాల వెనుక భాగం, కేఎల్ రావు పార్కు, కుమ్మరిపాలెం సెంటర్ తదితర కొండ ప్రాంతాల్లో జరుగుతున్న ఇళ్ల క్రమబద్ధీకరణను ఆమె పరిశీలించారు. స్థానికులకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపర్చాలని, ఖాళీ స్థలాల్లో చెత్త, వ్యర్థాలు వేయవద్దని స్థానికులకు సూచించారు. ఈ పర్యటనలో వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి రాయన నరేంద్ర కుమార్, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బీవీ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10గంటల వరకు స్థానిక న్యూరాజీవ్‌నగర్, జర్నలిస్టు కాలనీ, కండ్రిక తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ధీరోదాత్తుడు టంగుటూరి

రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



టంగుటూరి ప్రకాశం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తోట శ్రీనివాస్ తదితరులు



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ గౌతంరెడ్డి



ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు తదితరులు



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వాతంత్ర్య సమర యోధులు, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం నేటి తరానికి ఆదర్శమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ప్రకాశం పంతులు 152వ జయంతి సందర్భంగా బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దగల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల అర్పించారు. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్ఫూర్తితో దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకులు ప్రకాశం పంతులని తెలిపారు. నాయకులు కొప్పవరపు బలరామకృష్ణమూర్తి, దోనేపూడి శ్రీనివాస్, చల్లా సుధాకర్, జేకే సుబ్బారావు, శనగవరపు శ్రీనివాస్, ప్రయాగ కృష్ణ, కృష్ణమోహన్, కూనపులి షణి, రఫీ, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు

మహనీయుడు టంగుటూరి..

మధురానగర్(విజయవాడసెంట్రల్): తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన మహనీయుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. స్థానిక సత్యనారాయణపురం భగత్‌సింగ్ రోడ్డులోని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో బుధవారం స్వాతంత్ర్య సమరయోధుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మొట్టమొదటి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనువాసరావు, నాయకులు పాల్గొన్నారు.

ముత్యాలంపాడులో..

ముత్యాలంపాడు శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం 75 సంవత్సరాల వజ్రోత్సవాలలో భాగంగా బుధవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు ముఖ్య అతిథిగా పాల్గొని టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయం అధ్యక్షుడు కె. సుబ్బరాజు, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొని మాట్లాడారు.

రాష్ట్రాభివృద్ధికి టంగుటూరి కృషి అజరామరం..

పాయకాపురం(విజయవాడరూరల్): ఆంధ్రరాష్ట్రం తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఎనలేని కృషి చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అదనపు కార్యదర్శి తోటశ్రీనివాస్ అన్నారు. బుధవారం 61వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 61వ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిశోర్, సీనియర్ నాయకులు అన్నపురెడ్డి రామిరెడ్డి, దాసం దుర్గారావు, దేవళ్ల అశోక్, కాకర్లహరి, భరద్వాజ్ పాల్గొన్నారు.

చిత్రరంజన్ గ్రంథాలయంలో..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 151వ జయంతి వేడుకలను సత్యనారాయణపురంలోని చిత్రరంజన్ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రకాశం పంతులు జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు.

ఘన నివాళి..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ జమల పూర్ణమ్మ టంగుటూరి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కే.రమాదేవి, గ్రంథాలయ సిబ్బంది డి.రమేశ్, కె.రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.